## డీఎస్సీ గురించి మాట్లాడే.. అర్హత గొడ్డలి పార్టీకి లేదు: ఎమ్మెల్యే



**కమలానగర్ మే31 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :**గతంలో ఒక్క ఉపాధ్యాయ ఉద్యోగం ఇవ్వలేని గొడ్డలి పార్టీ నాయకులు ఇవాళ డీఎస్సీ గురించి మాట్లాడుతున్నారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అర్బన్ తెదేపా కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. గత వైకాపా అధికారంలో ఉపాధ్యాయులను అవమానించేలా ప్రవర్తించారన్నారు. కేవలం జగన్ పీఏ అవినీతి అక్రమాలు బయటికి వస్తాయనే డైవర్షన్ రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో అరాచకాలు అక్రమాలు దౌర్జన్యాలను ప్రజలు ఇంకా మర్చిపోలేదని గుర్తు చేశారు. ఇవాళ రాష్ట్ర అభివృద్ధి సంక్షేమం కోసం పాటుపడుతూ 16 వేలకు పైగా ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు దక్కుతుందన్నారు. గతంలో అవినీతి అక్రమాలు దౌర్జన్యాలు చేసిన సంఘటనలు ప్రజలు మర్చిపోలేదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమయం మార్పు



**మార్కాపురం మే31 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :**మార్కాపురం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జూన్ 1వ తేదీ సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సమయాన్ని మార్చినట్లు కలెక్టర్ విజయ సునీత ఆదివారం తెలిపారు. ఇప్పటివరకు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు అర్జీలు స్వీకరించేవారు. రేపు సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు అర్జీలు స్వీకరిస్తారని కార్యాలయ నిర్వహణ అధికారులు వెల్లడించారు.

## సమాజ ప్రయోజనమే లక్ష్యంగా పరిశోధనలు జరగాలి

**కడప మే31 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :**నాణ్యమైన పరిశోధనల ద్వారానే సమాజానికి ప్రయోజనం చేకూరుతుందని, పరిశోధకులకు గుర్తింపు లభిస్తుందని వైవీయూ వీసీ ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ అన్నారు. ఆర్ అండ్ డి డైరెక్టర్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఈఎంఆర్ స్కాలర్లకు నిర్వహించిన ఆరు రోజుల ఓరియంటేషన్ ముగింపు సభలో ఆయన మాట్లాడారు. నియమ నిబంధనలు పాటిస్తూ సమాజానికి ఉపయోగపడే అత్యుత్తమ పరిశోధనలు చేయాలని ఆయన సూచించారు. ఈ శిక్షణలో పలు విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

## మానవత నూతన అధ్యక్షుడిగా దొంతల విజయ్ కుమార్ ఏకగ్రీవ ఎన్నిక



**ఉంగుటూరు మే31 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఉంగుటూరు నారాయణపురంలో జరిగిన ఉంగుటూరు మండల మానవతా సమావేశంలో, చేబ్రోలుకు చెందిన దొంతల విజయ్ కుమార్ (బోసు) నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నికయ్యారు. మానవత రాష్ట్ర విస్తరణ కమిటీ చైర్మన్ సాగిరాజు జానకీ రామరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశానికి మండల కన్వీనర్ అడపా శ్రీనివాస రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఐటిఐ కేంద్రంలో రేపు మెగా జాబ్ మేళా



**శ్రీకాకుళం మే31 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** శ్రీకాకుళం ప్రభుత్వ ఐటిఐ కార్యాలయంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి కె సుధ తెలిపారు. సోమవారం సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ కార్యాలయం ఆధ్వర్యంలో ఈ మేళా ఏర్పాటు చేయబడుతుంది. 18 నుండి 28 సంవత్సరాల లోపు వయస్సు గల నిరుద్యోగ అభ్యర్థులు పూర్తి వివరాలతో హాజరు కావాలని ఆమె సూచించారు.

## ప్రత్యేక శ్రద్ధతో చెరువుల సుందరీకరణ: మంత్రి కందుల దుర్గేశ్




**నిడదవోలు మే31 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెడుతున్నాయని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేశ్ పేర్కొన్నారు. ఆదివారం నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో రూ.50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సాంప్రదాయ నీటి వనరులు, చెరువుల పునరుద్ధరణ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు 'హెల్దీ, వెల్దీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్' నినాదానికి అనుగుణంగా రాష్ట్రంలో ఆరోగ్యకరమైన, ఆనందకరమైన, ఆర్థికవృద్ధిపరమైన వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సమిశ్రగూడెంలోని చెరువును ప్రత్యేక శ్రద్ధతో సుందరీకరిస్తున్నామన్నారు. నిడదవోలులోని మాలకోడూరు చెరువు అభివృద్ధికి ఇప్పటికే చర్యలు ప్రారంభించామని, ప్రజల కోరిక మేరకు మరో చెరువు వద్ద కూడా త్వరలోనే వాకింగ్ ట్రాక్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. రూ. 50 లక్షల ప్రభుత్వ నిధులతో పాటు రూ.3 లక్షల దాతల సహాయంతో 800 మీటర్ల ఫెన్సింగ్, ఆర్సీసీ బెంచీలు, చుట్టూ గ్రీన్ గ్రాస్ (పచ్చగడ్డి), ఆయిల్ ఫామ్ చెట్ల పెంపకం, రివిట్ మెంట్ పనులు చేపట్టనున్నట్లు వివరించారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని విమర్శించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## సత్ప్రవర్తనతో నడుచుకోవాలి,చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి




**శ్రీకాకుళం,మే31 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :**.చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండి,నేర ప్రవృత్తికి స్వస్తి పలికి, సత్ప్రవర్తనతో నడుచుకోవాలి అని జిల్లాలో గల రౌడీ షీటర్లు లకు పోలీసు అధికారులు కౌన్సిలింగ్ నిర్వహించారు.పోలీసు వారు సూచనలు, ఆదేశాలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని తెలిపారు. ఆదివారం పలు పోలీసు స్టేషను పరిధిలో రౌడీ షీటర్లు లకు పోలీసు అధికారులు కౌన్సిలింగ్ నిర్వహించారు.ఈ క్రమంలో జిల్లా ఎస్పీ శ్రీ కెవి మహేశ్వర రెడ్డి ఐపిఎస్ గారు ఆదేశాల మేరకు..శ్రీకాకుళం జిల్లా పట్టణ కేంద్రంగా పట్టణ పోలీస్ స్టేషన్, రూరల్ పోలీసు స్టేషన్లు తో పాటు జిల్లాలో పలు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లు, చెడు నడతగలవారిని పోలీస్ అధికారులు కౌన్సిలింగ్ నిర్వహించి నేరాలు చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, ఘర్షణలుకు దూరంగా ఉండాలన్నారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎలాంటి నేరాలకు పాల్పడకుండా నేర ప్రవృత్తిని మాని మంచి నడవడికతో, సత్ప్రవర్తనతో మెలగాలని, ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలలో పాల్గోవడం చేయరాదని, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రతి ఒక్కరు చెడు వ్యసనాలను దూరం చేసుకుని మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఎటువంటి కారణాలు లేకుండా ఘర్షణలు సృష్టించిన ప్రతి ఒక్కరిపై పోలీస్ వారి నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఎవ్వరైనా ఎక్కడైనా గొడవలు, ఇతర నేరాలలో పాల్గొంటే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసు అధికారులు హెచ్చరించారు.

## హార్లీ హిల్స్‌లో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: కలెక్టర్

**కొత్తకోట మే31 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** బి. కొత్తకోటలోని హార్లీ హిల్స్ ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ హెచ్చరించారు. ఆదివారం నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో రెండు గంటల్లోనే రూ. 52 వేల జరిమానా వసూలు చేసి, 13 వాహనాలపై కేసులు నమోదు చేసి, పలు వాహనాలను సీజ్ చేశారు. యువకులు అతివేగంగా నడపడం, ట్రిపుల్ రైడింగ్, మోడిఫైడ్ సైలెన్సర్లతో శబ్ద కాలుష్యం, హెల్మెట్ లేకపోవడంపై కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు. పర్యాటకుల భద్రత దృష్ట్యా ఇకపై నిరంతరం తనిఖీలు ఉంటాయని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.




## అన్నమయ్య జిల్లాలో గంజాయి 'రాపిడ్ టెస్టులు' ముమ్మరం



**మదనపల్లె మే31 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** అన్నమయ్య జిల్లాలో గంజాయి నిర్మూలన లక్ష్యంగా ఎస్పీ ధీరజ్ ఆదేశాల మేరకు పోలీసులు 'రాపిడ్ డ్రగ్ టెస్ట్'లు నిర్వహిస్తున్నారు. అనుమానితులు, నిందితులకు అత్యాధునిక డ్రగ్ డిటెక్షన్ కిట్ల ద్వారా అక్కడికక్కడే పరీక్షలు చేస్తున్నారు. ఇప్పటివరకు చేసిన పరీక్షల్లో అందరికీ 'నెగిటివ్' నివేదికలు వచ్చినట్లు అధికారులు ఆదివారం తెలిపారు. యువత మత్తుకు బానిస కాకుండా ముందస్తు జాగ్రత్తగా ఈ తనిఖీలు చేపడుతున్నామని, గంజాయి విక్రేతలపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## పదవీ విరమణ పొందిన ఎస్ఐను సన్మానించిన జిల్లా ఎస్పీ



**బాపట్ల మే31 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్, సుదీర్ఘ కాలం పోలీస్ శాఖకు సేవలు అందించిన ఎస్ఐ మల్లవరపు శ్రీనివాసులును ఆదివారం ఘనంగా సన్మానించి, ఆత్మీయ వీడ్కోలు పలికారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు కుటుంబ సభ్యులు కూడా పాల్గొన్నారు. ఎస్పీ శ్రీనివాసులును పూలమాలలు, దుశ్శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. పలువురు పోలీస్ అధికారులు కూడా ఆయనను సన్మానించారు. పోలీస్ శాఖకు ఆయన చేసిన సేవలను ఎస్పీ కొనియాడారు.

## బాలినేని శ్రీనివాస్ రెడ్డితో 'టీం 99', జనసేన నేతల భేటీ




**చీరాల మే31 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 'టీం 99' సభ్యులు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు బాలినేని శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చీరాల నియోజకవర్గంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై వారు సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో భాగంగా నియోజకవర్గంలో పార్టీ తాజా పరిస్థితులు, క్షేత్రస్థాయి పరిణామాలను బాలినేని శ్రీనివాస్ రెడ్డి అడిగి తెలుసుకున్నారు.

## కారు.. లారీ ఢీకొని.. ముగ్గురికి తీవ్ర గాయాలు



**ఉరవకొండ మే31 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు అయిన ఘటన ఉరవకొండ మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల ద్వారా తెలిసిన వివరాలివీ... బెంగళూరులోని యలహంక చెన్నూరు సమీపంలోని హన్నంహళ్లికి చెందిన మంజునాథ్, మహాలక్ష్మి, దర్శన్ కుటుంబం మంత్రాలయం రాఘవేంద్రస్వామిని దర్శించుకుని ఆదివారం సాయంత్రం ఉరవకొండ మీదుగా కారులో స్వగ్రామానికి వెళ్తున్నారు. అనంతపురం నుంచి ఉరవకొండ వైపు లారీ వెళ్తోంది. ఈ రెండు వాహనాలు మండలంలోని కోనాపురం వద్ద జాతీయ రహదారిలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాద ధాటికి కారులో ఇరుక్కు పోయిన వారిని స్థానికులు అతికష్టం మీద బయటకు తీశారు. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా, స్థానికులు వారిని అత్యవసర వాహనంలో చికిత్స కోసం ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి వారిని మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్లారు. ఈ ఘటనలో రెండు వాహనాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ ఘటనతో జాతీయ రహదారిలో చాలాసేపు రాకపోకలు స్తంభించాయి. ప్రమాదంపై పోలీసులు వివరాలు సేకరించారు.

## వైభవంగా మరిడిమాంబ పండగ



**సింహాచలం మే31 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** సింహాద్రి అప్పన్న స్వామి సోదరి, అడివివరం గ్రామ పొలిమేర దేవత మరిడిమాంబ అమ్మవారి ద్వైవార్షిక పండగ మహోత్సవం ఆదివారం వైభవోపేతంగా జరిగింది. అమ్మవారి పూజారి గాంధీనగర్‌లోని చదరంపట్టు వద్ద నుంచి అమ్మవారి ప్రతిమను శిరస్సున ధరించి ఊరేగింపుగా బయలుదేరారు. వందలాది మంది గ్రామస్థులు అమ్మవారిపై దుష్ట శక్తులు దాడి చేయకుండా కర్రలతో రక్షణ కవచంగా నిలిచి ఊరేగింపును కొనసాగించారు. దారి పొడవునా మహిళలు అమ్మవారికి జలాభిషేకాలు నిర్వహించారు. పండ్లు, పలహారాలు, సారె సమర్పించి అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్నారు. పాత గోశాల కూడలిలోని పొలిమేర వద్ద మూడుసార్లు ప్రదక్షణ చేసి శ్రీనివాస్ నగర్ లోని ఆలయం వద్ద అమ్మవారిని కొలువు తీర్చడంతో పండగ పరిసమాప్తమైంది. మిట్ట మధ్యాహ్నం మండుటెండలో ఈ ఊరేగింపు జరగడం విశేషం. ప్రతి రెండేళ్లకు ఒకసారి మరిడిమాంబ పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

## రేణిగుంట సబ్-డివిజన్ లో సెక్షన్-30 అమలు.. డీఎస్పీ

**కోడూరు మే31 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :**తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఐపీఎస్ ఆదేశాల మేరకు, రేణిగుంట సబ్-డివిజన్ పరిధిలో జూన్ 1 నుంచి జూన్ 30 వరకు సెక్షన్-30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని డీఎస్పీ వై. శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ, అవాంఛనీయ ఘటనల నివారణ కోసం ఈ నిర్ణయం తీసుకున్నారు. పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. రేణిగుంట, గాజులమండ్యం, ఏర్పేడు, రైల్వే కోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేల్, పుల్లంపేట, పెనగలూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయి. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.




## కోడుమూరు ఏపీడబ్ల్యూజేఎఫ్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**కోడుమూరు మే31 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కోడుమూరు నియోజకవర్గ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ నూతన కమిటీ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. గౌరవ అధ్యక్షుడిగా ఇంతియాజ్ బాషా, అధ్యక్షుడిగా టి. రఘు, ఉపాధ్యక్షుడిగా వెంకట్, ప్రధాన కార్యదర్శిగా హంపిరెడ్డి, కోశాధికారిగా గణేష్, సహాయ కార్యదర్శిగా నాగరాజు ఎన్నికయ్యారు. యుగంధర్, ఎస్. గిరిబాబు, బి. వీరన్న, సి. శివ, లక్ష్మన్న కమిటీ సభ్యులుగా వ్యవహరిస్తారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోరంట్లప్ప, జిల్లా నాయకులు టీజీ ప్రసాద్, శివన్న, చంద్రమోహన్ ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు జరిగాయి.

## మానవత నూతన అధ్యక్షుడిగా దొంతల విజయ్ కుమార్ ఎన్నిక



**ఉంగుటూరు మే31 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నారాయణపురంలో జరిగిన ఉంగుటూరు మండల మానవతా సమావేశంలో, చేబ్రోలుకు చ దొంతల విజయ్ కుమార్ (బోసు) నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నికయ్యారు. మానవత రాష్ట్ర విస్తరణ కమిటీ చైర్మన్ సాగిరాజు జానకీ రామరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశానికి మండల కన్వీనర్ అడపా శ్రీనివాస రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No: 1-3/21-16, Kamakotinagar, Vidyadharapuram, Vijayawada-520 012. (A.P.) and Printed at SKYLINE PRESS, D.No: 1-3/21-16, Kamakotinagar, Vidyadharapuram, Vijayawada-520 012. (A.P.), Associate Editor : K. Neeraja, Ph: 0866-2411299. E-mail: netimanadesam.vja@gmail.com